

"సార్. మీకు ఫోన్ వచ్చింది. ఎవరో హేమంత్ అంట" అన్న ప్యూన్ మాటలు విని కంప్యూ టర్ ముందు నుంచి లేచి ఫోన్ వైపుకు వెళ్ళాను. హేమంత్ నా బెస్ట్ ఫ్రెండ్. నాకు ఆత్మీ యుడు. అయినా వాడితో మాటా ్లడాలంటే నా మనస్సంగీకరించడం లేదు. ఇక తప్పదు కాబట్టి రిసీవర్ ఎత్తి "హలో" అన్నాను.


"హాయ్ అభీ!ఎలా వున్నావురా? ఏరా! ఈ స్నేహితుడ్ని మరచిపోయావా? కనీసం ఫోన్ కూడా చేయటం లేదు. పోయిన సంక్రాంతికి జరిగింది ఒక పీడకలరా దాన్ని మరిచిపో. ఈ సంక్రాంతికి నువ్వు తప్పకుండా మా వూరికి రావాలి. మన ఊరి వాళ్ళందరూ నిన్ను గుర్తు చేస్తున్నారు. రాకపోయావో నామీదొట్టే" అన్నాడు హేమంత్.

ఆ మాట విని నా కాలి కింద్రి భూమి కదిలినట్లు అనిపించి- సారీరా! నాకు వీలు కాకపోవచ్చు" అన్నాను.

"ఇదిగో తప్పించుకోవాలని చూశావో ఇక జన్మలో ఈ స్నేహితుడి ముఖం చూడలేవు" అంటూ ఫోన్ పెట్టేశాడు వాడు.

దీర్ఘంగా నిట్టూర్చిన నేను కూడా రిసీవర్ క్రెడిల్ చేశాను.

అనాధనైన నేను స్కాలర్‌షిప్ సహాయంతో చదువు పూర్తి చేసి ఉద్యోగ వేటలో వున్నప్పుడు హేమంత్‌తో పరిచయం అయ్యింది నాకు. బ్యాంకింగ్ కోచింగ్ కోసం తను కూడా



# భోగసుందరి

మం.డి.యస్డాన్

హైద్రాబాద్‌లో
కొన్ని రోజులు వున్నాడు.

తరువాత మా ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చాయి. వాడికి తిరుపతిలోనూ నాకు వైజాగ్‌లోనూ ఉద్యోగం రావడం వల్ల మేమిద్దరం తరచూ కలుసుకోలేకపోయేవాళ్ళం.

నాకంటూ ఎవరూ లేకపోవడం వల్ల వాడితో స్నేహం, వాడి ఆప్యాయతా నాకు ఎంతో పెనవేసుకుపోయింది. పైగా వాడు నాకు ఎన్నో విధాల సహాయపడివున్నాడు. మొదటిసారి నేను వాళ్ళ వూరికి క్రితం సంక్రాంతికి వెళ్ళాను.

* * *

నెల్లూరులో నన్ను రిసీవ్ చేసుకున్న హేమంత్, తమ వూరికి వెళ్ళేందుకు రెండుదార్లు వున్నాయంటూ చెప్పుకొచ్చాడు.

ఒకటి

ఇక్కడ మంచి గూడూరు వెళ్ళి అక్కడ నుంచి బస్సులో గుమ్మళ్ళదిబ్బకు వెళ్ళడం లేదా ఇక్కడ

నుంచి

బస్సులో కృష్ణాపట్నం రేవుకు వెళ్ళి అక్కడి నుంచి లాంచీలో వెళ్ళడం.

"కృష్ణాపట్నం వెళ్ళే వెళ్దాం" ఉత్సాహంగా



## పాపం మనీషా!

మనీషా కొయిరాలను ఆమె డిజైనర్ పెంచుకుంటున్న కుక్క కరిచి, 'పైసా వసూల్' అనే సినిమా షూటింగ్ సమయంలో జరిగిన యాక్సిండెంట్ నుంచి కోలుకున్న తరువాత తన స్నేహితులను పార్టీకి ఇన్‌వైట్ చేసింది. ఆ ఇన్‌విటేషన్‌లో స్పష్టంగా ఒక సూచన రాసి ఉంది. అదేమిటంటే, 'పార్టీకు వచ్చేవారు దయచేసి కుక్కలను తీసుకురావద్దు' అని. పాపం మనీషా కుక్కలని చూస్తే తెగ భయపడుతోంది.

అన్నాను నేను.

* * *

అటు బంగాళాఖాతం ఇటు కండలేరు వాగు మధ్యలో అద్భుతంగా వుంది గుమ్మళ్ళదిబ్బ అనే ఆ వూరు. కరేబియన్ దీవులూ, మారిషస్ బీచులూ నేనైతే చూడలేదు కానీ, ఇక్కడి ప్రకృతి కంటే అవి ఇంకా అందంగా ఉండవనిపించింది.

ఇక్కడి ప్రకృతి రమణీయతను నేను స్పష్టంగా వర్ణించగలిగితే మరో కృష్ణశాస్త్రినే కాగలను. సాగరకన్య నుదుటున దిద్దిన తిలకం లాగుందా ప్రాంతం! భూదేవి పాదాలకు పారాణిలా వున్నాయి ఇసుక తిన్నెలు!!! ఆ పాదాలకు సముద్రుడు వినయంతో వంగి తన కనురెప్పలతో తాకుతున్నట్లు వున్నాయి అలలు!!!

ఇంత మంచి ప్రాంతాన్ని వెలుగులోకి తేలేని మన పాలకుల మీద కోపం వచ్చింది నాకు. నా ఆలోచనల్లో నేనుండగా హేమంత్ ఇంటిని చేరుకున్నాను.

వాళ్ళది వుమ్మడి కుటుంబం కావడం వల్ల పిల్లలందరూ "బాబాయి!" "మావయ్యా!" అంటూ చుట్టుముట్టారు. నన్ను తమ కుటుంబ సభ్యులకు పరిచయం చేశాడు హేమంత్. అందరూ ఆప్యాయంగా పలకరించారు.

* * *

మరుసటి రోజు ఉదయాన్నే భోగి! సాగరతీరంలో సూర్యోదయాన్ని చూస్తూ ఆ చలిలో భోగిమంట చుట్టూ చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ గుమిగూడారు.

నా జీవితంలోనే అద్భుతమైన ఆ క్షణాలను ఎంజాయ్ చేస్తూ చుట్టూ చూస్తున్న నా చూపులు ఒక చోట మంత్రం వేసిట్టు ఆగిపోయాయి.

ఆ జనంలో ఒక నెరజాణ ప్రత్యేకంగా నా దృష్టిని ఆకర్షించింది. క్షీరసాగరాన్ని చిలికి దేవతలు అమృతాన్ని తీస్తే ఆ అమృతాన్ని చిలికి బ్రహ్మ ఈమెను సృష్టించినట్లున్నాడు. వాటే వండర్!!

పండు మిరపరంగు జాకెట్టు, చిలకపచ్చ రంగు ఓణీలో జామ చెట్టు మీద రామచిలకలా వుందామె.

ఆ భోగిమంట వెలుగు ఆమె ముఖం మీద పడి ఆ వదనం వింతగా మెరుస్తుంటే అవేమీ పట్టనట్టు ఆమె అమాయకంగా చలి కాచుకుంటోంది.

తొలి చూపు ప్రేమ మీద నాకు నమ్మకం లేకపోయినా ఈమెను చూడడంతో ఆ నమ్మకం పటాపంచలైపోయింది. ఐ ఫెల్ ఇన్ లవ్!

* * *

ఆ రోజంతా నా మనస్సు ఎప్పుడూ లేని విధంగా ఏదో నూతన ఉత్తేజంతో మరేదో మధురానుభూతితో నిండిపోయింది. దేని మీద మనసు లగ్నం చేయలేక ఆమె గురించే ఆలోచిస్తుండిపోయాను. ఆయితే బ్యాడ్‌లక్ ఆ భోగిసుందరి మళ్ళీ కనిపించలేదు.

ఆ రోజు రాత్రి సుష్టుగా భోం చేసి మేడ మీద కూర్చొని నేనూ, హేమంత్ పిచ్చాపాటి మాట్లాడుకుంటూ వుండగా ఒక అమ్మాయి వచ్చి "అన్నయ్యా! నిన్ను లావణ్య పిలుస్తోంది. త్వరగా రా!" అంటూ హేమంత్‌ను పిలిచింది.

హేమంత్‌తో పాటు నేను కూడా వీధిలోకి వచ్చాను. అక్కడంతా ఆడపిల్లలే ముగ్గుల కోలాహలంగా వుంది.

హేమంత్ చెల్లెలు లావణ్య వచ్చి అంది "అన్నయ్యా! మేమందరం ప్రతి ఏడాదిలాగే ఈ ఏడు కూడా ముగ్గులేశాము. అయితే ఈసారి కొత్తగా ఉత్తమ ముగ్గుకు ప్రైజ్ పెట్టాము. కానీ ఏది బెస్టో చెప్పే న్యాయ నిర్ణేత కావాలి!"

"దాందేముంది లేవే! నేను చెప్పేయనూ!" ఉత్సాహంగా అన్నాడు హేమంత్.

"నీకంత సీన్ లేదులే! ఖర్మకాలి నువ్వు నేనేసిన ముగ్గునే బెస్ట్ అన్నావనుకో పక్షపాతి అంటారు. అందుకని మన వూరికి కొత్త అయిన అభిరూప్ అన్నయ్యను జడ్జిగా పెడదాం" అంది లావణ్య.

"నేనా!నో!నో!" అంటూ ఒక అడుగు వెనక్కు వేశాను నేను. "లేదు మీరే చెప్పాలి" కోరస్‌గా అన్నారు అమ్మాయిలు.

"కానీరా!సిగ్గు పడతావెందుకు? వాళ్ళ సరదానికి మనం ఎందుకు కాదనాలి?" అంటూ హేమంత్ ప్రోత్సాహం ఇవ్వడంతో ఇక తప్పదన్నట్టు ముందుకు కదిలి ముగ్గులు పరిశీలించటం మొదలుపెట్టాను.

ఓ గాడ్! ఈ ఆడపిల్లల్లో ఎంత సృజనాత్మకం దాగుంది. ఒకటికి మించి ఒకటున్నాయి ఆ ముగ్గులు. అన్నిటినీ బాగా పరిశీలించాక అన్నింటికంటే ఒక ముగ్గు మాత్రం నా దృష్టిని విపరీతంగా ఆకర్షించింది.

"డియర్ ఫ్రెండ్స్! అన్ని పండ్లూ రుచికరమైనవే. అయినా పండ్లల్లో రారాజు మామిడి పండు. అన్ని పువ్వులూ అందమైనవే. అయినా వాటికి రాజు రోజా పువ్వు. అలాగే అన్ని ముగ్గులూ అద్భుతంగా వున్నాయి. కాని ఒక్కటి మాత్రం అత్యద్భుతంగా వుంది" అంటూ ఆ ముగ్గు చూపించాను.

హేమంత్ వచ్చి నా చేతికి ఒక ప్యాకెట్ అందించి "చేతుల మీదే ఆ ముగ్గు వేసిన చేతులకు ఈ బహుమతి ఇవ్వు" అన్నాడు.

ఆడపిల్లలందరూ "హే" అంటూ క్లాప్స్ కొట్టి 'హర్షిణీ' అన్నారు.

అదిగో అప్పుడు ఆ జనంలో నుంచి బిడియ పడుతూ ముందుకు వచ్చింది భోగిసుందరి.

నీలం రంగు జాకెట్టు తెల్లని వోణీలో ఆమె అలా నావైపుకే వస్తుంటే సాగరకన్య నా ముందుకు వస్తున్నట్లు నేను మైమరచి చూస్తుండిపోయాను.

అందమైన రూపము, చక్కని సృజనాత్మకము అన్నింటికీ మించి ఆమె లోని సహజమైన అణుకువ వల్ల అమాయకత్వం నిండిన ఆ చిలిపి కళ్ళు నన్ను వివశుడ్ని చేస్తున్నాయి. నా చేతిలోని ప్యాకెట్టును ఆమెకు అందిస్తుంటే నా మనసే ఆమెకు అందిస్తున్న ఫీలింగ్ కలిగింది నాకు.

ఇక ఆలస్యం చేయడం అనవసరమనిపించి వెంటనే నా మనసులోని మాటను హేమంత్‌తో చెప్పాను. నా జీవితంలో అవి ఎంత ఆనందకరమైన క్షణాలో అనుకున్నానో హేమంత్ చెప్పిన సమాధానం విని నీరుకారిపోయాను. ఇంతకంటే దురదృష్టకరమైన సమయం నా జీవితంలో రాదనిపించింది.

* * *

తెల్లారితే సంక్రాంతి. నాకెంతో ఇష్టమైన పండుగ. కాని, నా మనసుకు ఎంతో కష్టంగా వుంది. పడుకున్నానన్నమాటే కాని నిద్ర పట్టలేదు. ఆకాశంలో తారల వంక చూస్తూ ఆలోచిస్తున్నాను.

ఇంతలోనే నా మనసుకు అంత దగ్గరైన ఆమె ఆ తారల్లాగే నాకు అందదని తెలిసి నేను తట్టుకోలేకపోతున్నాను.

"సారీరా! ఆ అమ్మాయికి ఇది వరకే నిశ్చితార్థం అయిపోయింది. ముహుర్తాలు కూడా పెట్టుకున్నారు," హేమంత్ చెప్పిన మాటలు నా చెవుల్లో రిపీట్ అవుతున్నాయి.

నా ఆలోచనల్లో నేనుండగా తెల్లారింది. భోగి రోజు వున్న ఉత్సాహం సంక్రాంతికి నాలో మచ్చుకు కూడా కనిపించడం లేదు. అది గమనించి హేమంత్ "అలా వూరు చూసొద్దాం రా!" అంటూ నన్ను లాక్కొని వెళ్ళాడు.

అందమైన ఆ వూరి పరిసరాలను గమనించే స్థితిలో లేను. నేను యాంత్రికంగా నడుస్తున్నాను. గుడికి వెళ్ళి దైవదర్శనం చేసుకుని వస్తుంటే-

ఒక ఇంట్లో నుంచి ఒకామె వచ్చి "హేమంత్" అని పిలిచింది.

"హర్షిణీ వాళ్ళ అమ్మ. ఇది వాళ్ళ ఇల్లు" చిన్నగా అన్నాడు హేమంత్.

"లోనికి రా" పిలిచింది ఆవిడ.

నేను రానన్నాను. అయితే బాగోదని హేమంత్ నన్ను లోపలికి పిల్చుకెళ్ళాడు. కూర్చున్నాక కాఫీ తెచ్చి ఇచ్చింది.

"ఈ అబ్బాయిది వైజాగ్ అట కదా?" ప్రశ్నించింది హర్షిణి వాళ్ళ అమ్మ. ఔనన్నాడు హేమంత్.

"మా కాబోయే అల్లుడిది అదే వూరు. బహుశా మీకు తెలిసే వుండొచ్చు. ఈ ఫోటో చూడండి" అంటూ ఒక అబ్బాయి ఫోటో తెచ్చి ఇచ్చింది.

ముభావంగా ఆ ఫోటోను చూసిన నేను వులిక్కిపడ్డాను. అతనేనా కాదా అని మార్చి మార్చి చూశాను. డౌట్ లేదు అతనే!!!

"ఇతని పేరు ప్రసాద్ కదూ!" ఆతృతగా అడిగాను.

"ఔను! మీకు తెలుసా?" అడిగింది హర్షిణి వాళ్ళమ్మ.

"ఇతని గురించి పూర్తి వివరాలు తెల్సుకునే ఈ పెళ్ళి నిశ్చయించారా?" అంటున్న నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ-

"ఎందుకు బాబూ అలా అడుగుతున్నావు? వాళ్ళు మా బంధువులకు బాగా తెలిసిన వారంట. చాలా మంచి సంబంధం అని వాళ్ళు చెప్పారు. వాళ్ళ మాట మీద నమ్మకంతోనే అంత దూరమైనా మేము ఈ పెళ్ళికి అంగీకరించాము" చెప్పిందావిడ.

"ఇతనిది వైజాగ్‌లో నేనుంటున్న వీధిలోనే ఇల్లు. ఇతనికి ఇది వరకే పెళ్ళైంది. తాగుడు అలవాటుంది. తన భార్యను చాలా హింసించేవాడు. ఆఖరుకి ఆమె చనిపోయాక అతను అక్కడి ఇల్లు ఖాళీ చేశాడు. ఇప్పుడు ఎక్కడున్నాడో తెలియదు. కానీ ఇతను మాత్రం మంచి వాడు కాదు" ఉద్విగ్నంగా అంటున్న నా వైపు అపనమ్మకంగా చూసిందామె.

* * *

నేను చెప్పిన ఆ నిజం వల్ల ఊళ్ళో చాలా రబస జరిగింది. మధ్యలో వున్న హర్షిణి బంధువులు వచ్చి నేను చెప్పింది అబద్ధమని ఏదో కుట్రతో అన్నానని అన్నారు. దానితో వూరంతా నన్నే తప్పు పట్టారు. ఇక అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేక సంక్రాంతి రోజే నేను తిరుగు ప్రయాణం అయ్యాను.

ఇక అప్పటి నుంచి హేమంత్‌తో కూడా నాకు దాదాపుగా సంబంధాలు తెగిపోయాయి. మళ్ళీ సంక్రాంతికి వాడు రమ్మని ఫోను చేస్తే వెళ్ళకూడదని ఎంత అనుకున్నా వెళ్ళకుండా వుండలేక నేరుగా వాళ్ళ వూరికే వచ్చేశాను.

నాకంటూ ఎవరూ లేకపోవడం వల్ల బహుశా హేమంత్ లాంటి ఆత్మీయుణ్ణి మరిచిపోలేక వాడి పిలుపు విని వచ్చేసుంటాను. నేను వస్తున్నట్టు వాడికి ముందుగా తెలియజేయలేదు. సరాసరి ఇంటికి వచ్చేసిన నన్ను చూసి వాడూ, వాళ్ళ కుటుంబ సభ్యులూ చాలా ఆనందించారు. ఆ మరుసటి రోజు హేమంత్ వచ్చి "త్వరగా రెడీకా! మనం పెళ్ళిచూపులకు వెళ్ళాలి" అన్నాడు. నేను అది హేమంత్ పెళ్ళి చూపులనుకున్నాను. కానీ తీరా హర్షిణి వాళ్ళ ఇంటికి పిల్చుకెళ్ళి నా ముందు పెళ్ళి కూతురంటూ హర్షిణిని కూర్చోబెట్టారు. నా తరపున పెద్దలుగా హేమంత్ వాళ్ళ అమ్మ, నాన్న నిలబడ్డారు.

"ఇదేమిటి? హర్షిణికి ఇంకా పెళ్ళి కాలేదా? నాకూ ఆమెకు పెళ్ళి చూపులా?" ఏమీ అర్థం కాక అయోమయంగా హేమంత్ వంక చూశాను.

"సారీరా!వూరంతా నీ మాట నమ్మలేదు. కాని హర్షిణి నమ్మింది. ఈ పెళ్ళి చేసుకోనంది. దానితో వాళ్ళ అన్నయ్య వైజాగ్ వెళ్ళి విచారిస్తే నువ్వు చెప్పింది నిజమేనని తెలిసింది. తీగలాగితే డొంకంతా కదిలినట్టు వీళ్ళ బంధువులు ఏదో పాత కక్షలు మనసులో పెట్టుకొని ఈ అమ్మాయి గొంతు కోయాలని చూశారు. అయితే నీ వల్ల హర్షిణి బ్రతుకు ఆ విషవలయం నుంచి తప్పించుకుంది.

వూరి వాళ్ళందరూ ఏకమై నా ప్రాణం తీసి నిన్ను పిలిపించారు. పనిలో పనిగా క్రితం భోగికి నువ్వు చెప్పిన నీ మనసులోని మాటను నేను వీళ్ళతో చెప్పాను. నిన్ను తమ అల్లుణ్ణి చేసుకునేందుకు ఆనందంగా అంగీకరించారు హర్షిణి వాళ్ళ అమ్మా, నాన్న" అన్నాడు హేమంత్.

ఉద్వేగంతోనూ, ఆనందంతోనూ నా నరాలు చిట్లిపోతున్న భావన కలుగుతుంటే "మరీ...మరీ... హర్షిణికి నాతో పెళ్ళి ఇష్టమేనా?" అడిగాను.

"ఆమె అంగీకారం ఆ చూపుల్లో తెలీడం లేదా?" అన్నాడు హేమంత్. నేను అప్పుడు స్పష్టంగా హర్షిణి వైపు చూశాను. ఆమె నావైపు ఓరగా చూస్తూ చిలిపిగా నవ్వుతోంది.

"హుర్రే" అని అరవాలనిపించింది నాకు. ఆ సంక్రాంతి సంబరాన్ని మనసారా ఆస్వాదించి ఆ వూరి అల్లుడినైపోయాను నేను. నిష్కల్మషమైన పల్లె ప్రజల్లో నిజమైన పండుగలను చేసుకోగలము. ఎవరూ లేరనుకున్న నాకు ఈ భోగిసుందరి వల్ల ఎంతోమంది బంధువులూ, మరెంతో మంది ఆత్మీయులూ!

